సాక్షి అనకాపల్లి

మంగళవారం : 16 : జూలై : 2024



అశ్రద్ధ చేస్తే సహించం

కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 247 అర్జీలు అందాయి. వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



బ్యాంకర్స్ క్రికెట్ టోర్నీ

తగరపువలస: చిట్టివలసలో జరిగిన బ్యాంకర్స్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పంజాబ్ నేషనల్ బ్యాంకు జట్టు నిలిచింది.

గరిష్ఠం/కనిష్ఠం 31.8/25.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్లపడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



బీసీ వెల్ఫేర్ మహిళా వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్

అనకాపల్లి: వర్షాకాలంలో ప్రజలు వివిధ వ్యాధుల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు అప్రమత్తమయ్యేలా వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్ అన్నారు. మండలంలోని తుమ్మపాల పంచాయతీ పరిధి గుండాల గ్రామంలోని బీసీ వెల్ఫేర్ మహిళా వసతి గృహాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వసతి గృహాల్లో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కాచి, వడబోసిన నీటిని పిల్లలు తీసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒక రోజుకంటే ఎక్కువగా జ్వరంతో బాధపడే విద్యార్థుల్ని దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లి రక్తపరీక్షలు చేయించి, సకాలంలో చికిత్స అందించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తుమ్మపాల వైద్యసిబ్బంది రామచంద్రరావు, మంగమ్మ, బి.సంఘం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా సత్యనారాయణ



నియామక పత్రం అందుకుంటున్న సత్యనారాయణ

అనకాపల్లి : స్థానిక గవరపాలేనికి చెందిన ప్రభుత్వ విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు కె.ఎస్.వి.సత్యనారాయణ భారతీయ టెన్నికాయిట్ టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన తెలిపారు. ఆయన 2028 వరకు ఈ పదవిలో ఉంటారు.

తుది విడత చందనం అరగదీత



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి తుది విడత చందనం అరగదీత(ఆఖరి విడత) ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 21న ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఆరోజు స్వామికి సమర్పించేందుకు అవసరమైన మూడు మణుగుల పచ్చిచందనం(120కిలోలు) అరగదీత చేపట్టారు. ఉదయం 7 గంటల నుంచి నాల్గవ తరగతి సిబ్బంది చందనం అరగదీతను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. కాగా ఏడాదిలో నాలుగు విడతలుగా స్వామికి మూడేసి మణుగుల చొప్పున(120 కిలోల చొప్పున) పచ్చి చందనం సమర్పిస్తారు. చందనోత్సవం రోజు రాత్రి, వైశాఖ పౌర్ణమి, జ్యేష్ఠ పౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో తెల్లవారుజామున మూడేసి మణుగుల చొప్పున చందనాన్ని సమర్పిస్తారు. ఇప్పటికే గత చందనోత్సవం, వైశాఖ పౌర్ణమి, జ్యేష్ఠ పౌర్ణమి రోజుల్లో మూడు విడతల చందనం సమర్పణ పూర్తయింది. ఆఖరి విడతగా ఈనెల 21న సమర్పిస్తారు.

అంతర జిల్లాల స్విమ్మింగ్‌లో రన్నరప్ విశాఖ

విశాఖ స్పోర్ట్స్ : ఏపీ సబ్‌జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్, సెలక్షన్ ట్రయిల్స్ పోటీల్లో విశాఖ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ పోటీలు కర్నూలు జిల్లాలో జరగ్గా విశాఖ జట్టు 101 పాయింట్లు సాధించింది. సత్తా చాటిన స్విమ్మర్లను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయగా వీరంతా ఆగస్టు 6 నుంచి భువనేశ్వర్‌లో జరిగే అంతరరాష్ట్ర పోటీల్లో పాల్గొనున్నారు. అంతర జిల్లాల పోటీల్లో గణేష్ చక్రధర్, జిషి తేష్, ప్రియేష్, సౌరవ్, సంజయ్, వైభవ్, నిష్టా, ప్రహర్షిణి, సరయు, అనన్య, అంజలి, హైందవి పతకాలు సాధించి సత్తా చాటారు.

భృతి ఓ భ్రమ



- ఇంటికో ఉద్యోగమంటూ ఊదరగొట్టిన చంద్రబాబు
- లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ
- నెల రోజులు దాటినా ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 2.30 లక్షల మంది నిరుద్యోగులు
- నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ కోసం ఎదురుచూపులు

'ఎవరికైనా ఉద్యోగాలొచ్చాయా తమ్ముళ్లూ..? రాలేదు కదా.. కొంతమందికి ఉద్యోగాలిచ్చారు.. మూటలు మోసే ఉద్యోగం.. అవీ ఒక ఉద్యోగాలేనా.? నేను సీఎం అయిన వెంటనే.. ఇంటికో ఉద్యోగమిస్తా.. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అందిస్తాను.. ఎవరూ భయపడొద్దు.. బాబు వస్తే.. ఇంటింటికీ జాబొస్తాదీ...''

– ఎన్నికల ప్రచార సమయంలో ఎక్కడికెళ్లినా.. చంద్రబాబు ఊదరగొట్టిన ప్రసంగమిదీ.

సాక్షి, అనకాపల్లి : అధికారంలోకి రాకముందు ఒక మాట.. వచ్చిన తర్వాత మరో మాట.. ఇదీ చంద్రబాబు నైజం. ఎన్నికల ముందు ఒట్టేసి ఒక మాట.. ఒట్టెయ్యకుండా ఒక మాట చెప్పడు ఈ ఛత్రపతి అన్న రేంజ్‌లో.. నోటికొచ్చిన హామీలిచ్చి.. వాటిని తుంగలో తొక్కడం.. లేదంటే.. నిబంధనల చట్రంలో బందీలుగా మార్చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. తల్లులందరికీ వందనమంటూ వంగి వంగి నమస్కారాలు పెట్టిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక.. ఒక్క తల్లికే వందనమంటూ మాట మార్చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగం లేదా.. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పడంతో ఎదురుచూపులు చూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమవుతోంది. అసలు భృతి ఇస్తారా ఇవ్వరా అనే సందేహాలు కూడా తలెత్తుతున్నాయి.

ఇంటికో ఉద్యోగం వస్తుందా?

నిరుద్యోగ భృతి లేదంటే ఇంటికో ఉద్యోగం ఇస్తానంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. జిల్లాలో మొత్తం ఇళ్ల సంఖ్యను బట్టి రెండు లక్షల మందికిపైగా ఉద్యోగాలు కూడా ఇవ్వాల్సి ఉంది. కానీ గతంలో ఉద్యోగమంటూ ఊదరగొట్టి అందరికీ మొండిచెయ్యి చూపించిన చంద్రబాబు.. ఈసారీ అదే వైఖరి అవలంబిస్తారేమోనంటూ నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హామీలను నమ్మి ప్రతిసారీ చంద్రబాబు ప్రభుత్వం చేతిలో మోసపోతున్నామంటూ వాపోతున్నారు.

2014లోనూ అదే అబద్ధం

2014 ఎన్నికల్లోనూ అదే అబద్ధంతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. నాలుగున్నరేళ్ల పాటు సాగదీసిన తర్వాత.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో తెరపైకి తీసుకొచ్చారు. తొలుత ఇంటింటికీ ఉద్యోగం.. లేకుంటే ప్రతి నిరుద్యోగికి రూ.2 వేల భృతి అని ప్రకటించి.. చివరికి రూ.1000 మాత్రమే ఇస్తామన్నారు. పోనీ.. అదైనా నిరుద్యోగులందరికీ సక్రమంగా ఇచ్చారా అంటే.. అందులోనూ రోజుకో కొత్త నిబంధన తీసుకొచ్చి.. నిరుద్యోగులకు ముచ్చెమటలు పట్టించారు. కుటుంబంలో ఎవరికీ ప్రభుత్వ ఉద్యోగం ఉండకూడదనీ, రూ.50 వేలకు మించి రుణం ఉండకూడదంటూ సవాలక్ష ఆంక్షలు విధించారు. ఈ కారణంగా అనేక మంది నిరుద్యోగులకు ఈ పథకం అందని ద్రాక్షగానే మారింది. క్రమంగా వివిధ సాకులతో నిరుద్యోగులను భృతి జాబితా నుంచి తొలగించడంతో అందరి ఆశలూ గల్లంతయ్యాయి.

2014-19లో ఉమ్మడి విశాఖ జిల్లాలోని నిరుద్యోగులను మోసం చేశారిలా...

వెబ్‌సైట్‌లో నిరుద్యోగుల దరఖాస్తులు	11,67,179
ఓటీపీ జనరేట్ అయిన వారు	1,03,011
భృతికి అర్హత సాధించిన నిరుద్యోగులు	35,818
ఫిబ్రవరి 2019లో భృతి పొందిన నిరుద్యోగులు	28,383
మార్చిలో భృతి పొందిన నిరుద్యోగులు	28,495

వెంటనే ప్రకటన చేయాలి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా ఈ హామీపై ఎలాంటి ప్రకటన చేయలేదు. నేను ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. విద్యార్హత ఆధారంగా ఉద్యోగావకాశం కల్పించాలి. లేకుంటే ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి అందించేలా వెంటనే చర్యలు చేపట్టాలి.

–బుద్ద లోహిత్ కుమార్, ఇంజినీరింగ్ విద్యార్థి, టి.సిరసపల్లి, మునగపాక మండలం

నెల గడిచినా ఊసెత్తని సర్కారు..!

మరోసారి ఇంటికో ఉద్యోగం లేదంటే నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటుతున్నా.. దీనిపై కనీసం సమీక్ష చేయడం గానీ.. అధికారులకు ఆదేశాలు జారీ చేయడంగానీ జరగలేదు. జిల్లాలోని 24 మండలాల పరిధిలో 4,79,920 కుటుంబాలు ఉన్నాయి. ఈ ఇళ్లలో నిరుద్యోగులు దాదాపు 2,30,000 మంది ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరిలో గ్రామీణ ప్రాంతాల పరిధిలో 2,10,500 మంది, జిల్లా కేంద్రం అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం పట్టణాల పరిధిలో 19,500మంది ఉంటారు. వీరందరికీ రూ.3 వేలు చొప్పున ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. అంటే..



ప్రతి నెలా జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు రూ.69 కోట్లకు పైగానే భృతి అందించాలి.

గతంలో కూడా ఇదే హామీ



నేను బీటెక్ పూర్తి చేశాను. ఎటువంటి ఉపాధి లేదు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా తక్షణమే నిరుద్యోగ భృతి చెల్లించాలి. గతంలో కూడా చంద్రబాబు ఇదే హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. చివరి ఒకట్రెండు నెలలు మాత్రమే ఇచ్చారు. అందుకే నిరుద్యోగుల్లో అనుమానాలు రేగుతున్నాయి. కూటమి ప్రభుత్వం తక్షణమే నిర్యుదోగ భృతి చెల్లించాలి. దీంతోపాటు వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలి.

– సాయితేజ్, నిరుద్యోగి, పాయకరావుపేట

వైఎస్సార్‌సీపీ హయాంలో ఉద్యోగాల వెల్లువ

2019–24 మధ్య కాలంలో ఉద్యోగాల జాతరే జరిగింది. జిల్లా పరిధిలో 6,000 మందికి సచివాలయ ఉద్యోగాలు కల్పించారు. వీరితోపాటు సొంత ఊరిలో రూ.5 వేల గౌరవ వేతనం పొందుతూ 10 వేల మందికి పైగా నిరుద్యోగులు వలంటీర్లుగా సేవలందించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ కల్పించగా ఉద్యోగాలు పొందిన వారు 8000 మంది ఉన్నారు. భారీ పరిశ్రమల్లో 42,058 మందికి, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో 8,064 మందికి ఉపాధి కల్పించారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలు 2 వేల మందికి ఇచ్చారు. ఇలా ఐదేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ సొంతం చేసుకుంది.



ఉపాధి అవకాశాలు కల్పించాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఇంటికో ఉద్యోగం అన్నారు. నేను పట్టభద్రుడిని. నాలాంటి ఎందరో యువకులు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. ఇప్పటి వరకు ఆ దిశగా కనీస సమాచారం మీడియాలో కనిపించట్లేదు. వెంటనే ఉపాధి అవకాశాలు కల్పించాలి. అప్పటి వరకు నిరుద్యోగ భృతిని అందరికీ అందించాలి.

– జి.పార్వతీశం, పట్టభద్రుడు, చౌడువాడ గ్రామం, కె.కోటపాడు మండలం

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలుపై కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.3 వేలు ఆర్థిక సాయం వెంటనే ప్రకటించాలి. డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగ అవకాశాల్లేక, తాత్కాలికంగా ఆటో నడుపుకుంటున్నా. ప్రభుత్వం మాలాంటి నిరుద్యోగులను మోసగించకుండా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. ప్రభుత్వ ప్రకటన కోసం నిరుద్యోగులంతా ఆశగా ఎదురుచూస్తున్నాం.

–షేక్ శ్రీను, నిరుద్యోగి, వీఆర్ పురం, దేవరాపల్లి మండలం

ఆ హామీపైనే ఆశలన్నీ



నేను బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశాను. ఇప్పటి వరకూ ఏ ఉద్యోగం రాక ఖాళీగా ఉన్నా. బతుకు భారంగా ఉంది. అలాంటి సమయంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే ఉద్యోగాలు వస్తాయి, లేకుంటే నిరుద్యోగ భృతి వస్తుందని ఆశపడ్డా. అదే జరిగితే నా భారం కుటుంబంపై ఉండదని ఆనందపడ్డా. చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. వెంటనే నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలి. జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి.

– కొట్టే జనార్దన్, నిరుద్యోగి, కొవ్వూరు గ్రామం, రోలుగుంట

హామీని నిలబెట్టుకోవాలి



రాష్ట్రంలో కూటమి పార్టీల నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలి. 20 లక్షల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలి. ఆలోగా నిరుద్యోగ భృతిని వెంటనే అందించాలి. నేను బీకాం పూర్తి చేసి రెండేళ్లయింది. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. జాబ్ క్యాలెండర్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నా. అప్పటి వరకు నిరుద్యోగ భృతి ఇస్తారని ఆశిస్తున్నా. ప్రభుత్వం తానిచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

-కె.సాయికుమారి, వీరనారాయణం, మాడుగుల మండలం

సాంకేతిక పరిజ్ఞానంతో కర్బన ఉద్గారాల నియంత్రణ



ఫార్మా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న సిరి కార్బన్ అడ్వయిజరీ సర్వీసెస్ ప్రతినిధి

అచ్యుతాపురం: ఎంఎస్‌ఎంఈల పరిధిలోని ఫార్మా కంపెనీల్లో కర్బన ఉద్గారాలను తగ్గించే ప్రక్రియలో భాగంగా ఎనర్జీ ఆడిట్ నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించనున్నట్లు సిరి కార్బన్ అడ్వయిజరీ సర్వీసెస్(హైదరాబాద్) డైరెక్టర్ జి.బాల సుబ్రమణ్యం తెలిపారు. అచ్యుతాపురం ఏపీఐఐసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఫార్మా క్లస్టర్లకు సంబంధించి పోస్ట్ ఇంప్లిమెంటేషన్ డిస్సెమినేషన్ వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. ఫార్మా కంపెనీల ప్రతినిధులకు, ఏపీఐఐసీ సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏపీఎస్‌ఈఎం వేరియబుల్ ఫ్రీక్వెన్సీ డ్రైవ్‌లు, ఫైబర్ రీన్‌ఫోర్స్ ప్లాస్టిక్ బ్లేడ్‌ల పనితీరుని వివరించారు. ఏసీల వినియోగంలో విద్యుత్ ఆదా చేసే సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలిపారు. శక్తి సామర్థ్య బ్లేడ్‌లు, చిల్లింగ్ యూనిట్‌లు, ఎనర్జీ ఆడిట్ నిర్వహించడంలో ఎంఎస్‌ఎంఈలకు ఎనర్జీ మేనేజ్‌మెంట్ సెంటర్లను ఏపీఎస్‌ఈఎం అభివృద్ధి చేసిందన్నారు. సదస్సులో సిరి ఎనర్జీస్ జాయింట్ సెక్రటరీ ఎ.రామారావు, ఎన్‌వీబీఎస్ భాస్కర్, టి.శివ రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్ కోసం 1912కి కాల్ చేయండి

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



సాక్షి, విశాఖపట్నం : కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావల్సిన రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయవచ్చని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని వివిధ మీ–సేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ కార్యాలయాల్లో కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదు సమయంలో పత్రాలను అప్‌లోడ్ చేసే సమయంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందుకే రైతులు నేరుగా ఏపీఈపీడీసీఎల్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు తమ ఆధార్ నంబర్, రిజిస్టర్డ్ ఫోన్ నంబర్, పట్టాదార్ పాస్ బుక్ నంబర్, సర్వే నంబర్, వాల్టా సర్టిఫికెట్ నంబర్, కులధృవీకరణ పత్రం వంటి వివరాలను తెలియచేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావలసిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో వర్షాల జోరు



అనకాపల్లి నెహ్రూచౌక్‌లో వర్షం కురుస్తున్న దృశ్యం



అనకాపల్లి ఎన్టీఆర్ క్రీడా మైదానం రహదారిలో వర్షం

- పలుచోట్ల స్తంభించిన జనజీవనం
- అనకాపల్లి మండలంలో 42.4 మి.మీ. అత్యధిక వర్షపాతం

అనకాపల్లి, తుమ్మపాల, చోడవరం: జిల్లా అంతటా సోమవారం జోరుగా వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పలుచోట్ల జనజీవనం స్తంభించింది. జిల్లాలో అత్యధికంగా అనకాపల్లి మండలంలో 42.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలో సగటు వర్షపాతం 99 మిల్లీమీటర్లు కాగా, సాయంత్రం నుంచి రాత్రి 7 గంటల వరకు జిల్లాలో 113.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని జిల్లా అర్థ గణాంక శాఖాధికారి జి.రామారావు తెలిపారు.

అనకాపల్లిలో..

గత మూడు రోజులుగా వాతావరణంలో మార్పుల కారణంగా సోమవారం పట్టణ పరిధిలో 16.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి సోమవారం చెప్పారు. మరో రెండు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఉదయం సమయంలో కొద్దిపాటి ఎండ వచ్చినప్పటికీ మధ్యాహ్నం 2 గంటలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రహదారులన్నీ జలమయ్యాయి. పట్టణ పరిధిలో శ్రీరామ్‌నగర్, లక్ష్మీదేవిపేట, రింగ్‌రోడ్డు, గవరపాలెం, పూల్‌బాగ్‌రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపునీరు నిల్వ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షం కురవడంతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



బుచ్చెయ్యపేట మండలంలో బీఎన్ రోడ్డులో కురుస్తున్న వర్షం

వర్షపాతం వివరాలు

మండలం	మి.మీ.
అనకాపల్లి	42.4
కశింకోట	27.2
సబ్బవరం	17.2
చోడవరం	11.4
మునగపాక	11.4
బుచ్చెయ్యపేట	2.4
కోటపాడు	1.2

చోడవరంలో..

ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తుండటంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. చోడవరం పరిసరాల్లో గత మూడు రోజుల్లో 20 మిల్లీమీటర్ల వర్షం కురవగా సోమవారం ఒక్కరోజే 20 మిల్లీమీటర్లు నమోదైంది. వర్షం ఏకధాటిగా ఎడతెరిపి లేకుండా కురిసింది. పొలాల్లో భారీగా నీరు చేరింది. వరి నారుమడులు వేసేందుకు ఈ వర్షం చాలా మేలు చేసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మరోపక్క రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

తిరుమల భక్తులకు శుభవార్త

- విశాఖ నుంచి రోజూ ప్రత్యేక టూర్ ప్యాకేజీ తీసుకొస్తున్న పర్యాటక శాఖ
- 30 స్లీపింగ్ బెర్తులతో ఏసీ బస్సుల ఏర్పాటు

8లో

ప్రజా ఫిర్యాదులపై అశ్రద్ధ చేస్తే సహించం

- హెచ్చరించిన కలెక్టర్ విజయకృష్ణన్
- ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు
- కలెక్టరేట్‌లో 247 అర్జీలు నమోదు

తుమ్మపాల : ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చే అర్జీలపై అధికారులు అశ్రద్ధ వహిస్తే సహించేది లేదని కలెక్టర్ విజయకృష్ణన్ హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. ప్రజల నుంచి అర్జీలను ఆమె స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని ఆమె అన్నారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రతి అర్జీని అధికారులు పరిశీలించాలని, తన పరిధిలో పరిష్కరించే అంశాలపై దృష్టి సారించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు చిత్తశుద్ధి, నాణ్యతా ప్రమాణాలతో పరిష్కరించాలన్నారు. మీ వద్దకు వచ్చిన బాధితులకు సాధ్యమైనంత వరకు మీ పరిధిలో న్యాయం చేయాలని అలా చేయలేకపోతే సాధ్యం కాదని వివరిస్తూ స్పష్టంగా చెప్పాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు. ప్రత్యేక శిబిరాల ద్వారా వినతుల నమోదు వేగంగా జరిగింది. మొత్తం 247 అర్జీలు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతుల ప్లాట్‌లకు రిజిస్ట్రేషన్లు చేయాలి...
ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకున్న డీపట్టా భూములకు ప్రత్యామ్నాయంగా మంజూరు చేసిన వీఎంఆర్డీఏ ప్లాట్‌లను రైతుల పేరున రిజిస్ట్రేషన్లు చేయాలని మండలంలో కొండపాలెం గ్రామానికి చెందిన రైతులు ఉరిటి అప్పారావు, చందక లక్ష్మి, పి.కోటేశ్వరరావు, మొల్లి అచ్చిబాబు, దాకారపు రామారావు కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. కొండపాలెం గ్రామం సర్వే నెం.178-1,2, 176-1,3,173-4 సుమారు 20 ఎకరాల తమ సాగు భూములను గత ప్రభుత్వంలో 2020లో ల్యాండ్‌పూలింగ్ నిమిత్తం ఇవ్వగా ప్రత్యామ్నాయ ప్లాట్‌లను కోడూరు గ్రామంలో కేటాయించారని, అయితే ప్లాట్‌లను తమ పేర్లతో రిజిస్ట్రేషన్లు చేయకుండా అన్యాయం చేస్తున్నారని వాపోయారు.

ఫార్మాసిటీలో ఉద్యోగాలు ఇవ్వాలి...
ఫార్మాసిటీ పైపులైన్ కారణంగా సముద్రం కలుషితమై మత్స్యజాతులు నశిస్తున్నాయని, దీంతో జీవనాధానం కోల్పోతున్న మత్స్యకార యువతకు ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించాలని పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామస్తులు కలెక్టర్‌కు వినతి అందించారు. ఈ అంశమై 2012లో అప్పటి జిల్లా అధికారులు స్పందించి 500 మందికి ఉద్యోగాలు కల్పించాలని ఒప్పందం చేసినప్పటికీ కేవలం 74 మందికి మాత్రమే ఉపాధి కల్పించారని తెలిపారు.


ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

నా భర్త నుంచి రక్షణ కల్పించండి...
తన భర్త గోవింద్‌కుమార్, అత్తారింటి నుంచి తనకు, తన బిడ్డకు రక్షణ కల్పించాలని కోరుతూ పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన వద్దాది సుజి కలెక్టర్, ఎస్పీలకు విన్నవించుకుంది.

విశాఖ జిల్లా మధురవాడ కొమ్మాది గ్రామానికి చెందిన గోవింద్‌కుమార్‌తో 5ఏళ్ల క్రితం వివాహమైందని, ఇద్దరు మగ బిడ్డలతో ఉండగా నిత్యం తగాదాలు భరించలేక పుట్టింటికి రావడంతో మరో పెళ్లి చేసుకున్నాడని తెలిపింది. తన కన్నా ముందు రెండు పెళ్లిళ్లు చేసుకుని తనను మోసం చేసాడన్నారు. విషయం తెలిసి ప్రశ్నించడంలో అతని కుటుంబసభ్యులతో కలిసి తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని, ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నా ఆడపడుచు తనపై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టి బెదిరిస్తున్నారని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ కేసుపై పదే పదే స్టేషన్‌కు రావాలంటూ పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది.


బిడ్డతో వద్దాది సుజ

ఆర్డీవోపై ఫిర్యాదు
సమాచార హక్కు చట్టం ద్వారా చేసుకునే దరఖాస్తులకు అస్పష్టమైన సమాధానాలు ఇస్తున్న అనకాపల్లి ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శి పీతా నానాజీ, మండల కిషన్ మోర్చా అధ్యక్షుడు ఆడారి కోటేశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సమాచార దరఖాస్తులపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, స్పష్టతపై అడిగితే హెచ్చరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

- జిల్లా ఆసుపత్రిలో మత్తు వ్యసన విముక్తి కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి బకాయి పడ్డ 12 నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని సిబ్బంది కలెక్టరేట్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు.
- ఏపీ బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, బిల్డింగ్ వర్కర్స్‌కు సంక్షేమ పథకాలు నిలిపివేస్తూ జారీ చేసిన మెమో 1214ను రద్దు చేయాలని యూనియన్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు.
- వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటును తక్షణమే నిలిపివేస్తూ బోర్లకు వేసిన స్మార్ట్ మీటర్లను తొలగించాలంటూ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు నిరసన తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో...
బాధితులకు న్యాయం చేస్తాం


సమస్యలు వింటున్న జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కర్

అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలు తెలుసుకుని వారి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమానికి 39 ఫిర్యాదులు రాగా వాటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటి ఫిర్యాదులు నమోదయ్యాయి. దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు, ఎస్ఐ సావిత్రి పాల్గొన్నారు.

తుప్పల్లో శిశువు మృతదేహం

పరవాడ: దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్ కాలనీ సమీపంలో సోమవారం సాయంత్రం మగ శిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పరవాడ పోలీసులకు సమాచారం అందించారు. పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు అందించిన వివరాలివి. అప్పుడే పుట్టిన మగ శిశువు మృతదేహాన్ని సాయినగర్‌కాలనీ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు తుప్పల్లో విసిరి వెళ్లిపోయారు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

క్లుప్తంగా

ఊపిరాడక చిన్నారి మృతి


చిన్నారి మృతదేహం

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు బాలాజీనగర్‌లో సోమవారం ఉదయం కూలర్ గాలికి ఊపిరి ఆడక తొమ్మిది నెలల చిన్నారి మృతి చెందిన విషాద సంఘటన చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి చెందిన గంట్యాడ ఉమా మహేష్ భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో పనిచేస్తూ తగరపువలసలో కుటుంబంతో నివసిస్తున్నారు. ఆయనకు భార్య, రెండేళ్లు, తొమ్మిది నెలల వయసు గల కుమార్తెలు ఉన్నారు. రెండు రోజులుగా చిన్న కుమార్తెకు జలుబుగా ఉండడంతో వైద్యం చేయిస్తున్నారు. బాలిక తల్లి సోమవారం ఉదయం స్నానం చేయించి కూలర్ వద్ద పడుకోబెట్టింది. కాసేపటి తర్వాత చూస్తే బాలిక చలనం కోల్పోయింది. దీంతో బాలాజీనగర్‌లో విషాదం నెలకొంది. చుట్టుపక్కల నుంచి పలువురు బాలికను చూసి చలించిపోయారు. వెంటనే చనిపోయిన బాలికను తీసుకుని తల్లిదండ్రులు వారి స్వస్థలానికి వెళ్లిపోయారు. దీనిపై వైద్యులు మాట్లాడుతూ బాలిక శరీరంలో టెంపరేచర్ తగ్గిపోయి చనిపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. దీనిపై బాలిక వివరాలు, మిగిలిన విషయాలు తెలియాల్సి వుంది.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


ట్రాక్‌పై పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఎస్.రాయవరం : నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్ పరిధిలో ప్లాట్‌ఫాం నంబర్ 2లో గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ ఎస్.కె.అబ్దుల్ మారూఫ్ సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తుని నుంచి విశాఖపట్నం వెలుతున్న రైలును గమనించకుండా సుమారు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి ట్రాక్ దాటడంతో ఈ ప్రమాదం జరిగింది. అయితే ప్రమాదంలో వ్యక్తి శరీరం నుజ్జు నుజ్జు అయ్యి చెల్లా చెదురుగా పడడంతో అనవాళ్లు ఏమీ అభించలేదు. మృతుని కాలికి స్టీల్ రాడ్డు ఉంది. ఈమేరకు మృత దేహాన్ని తుని రైల్వే ఆసుపత్రిలో భద్రపరుస్తున్నట్టు చెప్పారు. వివరాలు తెలిసిన వారు తుని రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

నర్సీపట్నంలో సినిమా షూటింగ్ సందడి


అమ్మవారి ఆలయంలో చిత్ర యూనిట్ సందడి

నర్సీపట్నం : రేషన్ ప్రొడక్షన్‌లో కార్తీక్ జయంతి, శ్రీష హీరో, హీరోయిన్లుగా రాధికా జయంతి దర్శకత్వం వహిస్తున్న 'రాయవలస' సినిమా షూటింగ్ ఇక్కడ ప్రారంభమైంది. నర్సీపట్నం మున్సిపాలిటీ, బలిఘట్టం శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక శారద విద్యా సంస్థల అధినేత బంగార్రాజు క్లాప్ కొట్టి సినిమా షూటింగ్ ప్రారంభించారు. రచయిత అల్లు రామకృష్ణ ఆలియాస్ రాఖీ అందరినీ మెప్పించేలా చిత్రాన్ని రూపొందించారని దర్శకురాలు జయంతి పేర్కొన్నారు. సినిమాకు గోపీకృష్ణ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కుటుంబ నేపథ్యంలో యూత్, లవ్ ఇతర ఇతర సన్నివేశాలతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటుందని నిర్మాత గోపీకృష్ణ తెలిపారు. 35 రోజుల పాటు జరిగే ఈ చిత్రం షూటింగ్ నర్సీపట్నం, లంబసింగి పరిసర ప్రాంతాల్లో ఉంటుందని తెలిపారు. కథానాయకి శ్రీష మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో జరిగే ఈ సినిమాలో నటించడం ఆనందంగా ఉందన్నారు. ఈ షూటింగ్ ప్రారంభోత్సవంలో ప్రముఖ వ్యాపారి వెలగా నారాయణరావు, మణి దంపతులు పాల్గొన్నారు.

తిరుమల భక్తులకు శుభవార్త

- విశాఖ నుంచి రోజూ ప్రత్యేక టూర్ ప్యాకేజీ తీసుకొస్తున్న పర్యాటక శాఖ
- 30 స్లీపింగ్ బెర్తులతో ఏసీ బస్సుల ఏర్పాటు
- ఈ నెల 19న తొలి సర్వీస్ ప్రారంభం

విశాఖ సిటీ : తిరుమల ప్రయాణికులకు శుభవార్త. ఇబ్బందులు లేకుండా తిరుమలేశుని దర్శనం చేసుకొనే భాగ్యాన్ని పర్యాటక శాఖ కల్పించనుంది. ఇందుకోసం విశాఖ నుంచి రోజూ తిరుమలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ నెల 19 నుంచి 30 స్లీపింగ్ బెర్తులతో ఏసీ బస్సు అప్పుఘర్ నుంచి బయలుదేరనుంది. తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లాలని ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తూనే ఉంటారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్ ద్వారా టికెట్లు రిలీజ్ చేసే రోజు ప్రతి ఒక్కరూ కంప్యూటర్, మొబైల్‌కు అతుక్కుపోతారు. టికెట్ల కోసం అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఉంటారు. దేశవ్యాప్తంగా భక్తులు టికెట్ల కోసం పోటీ పడడంతో చాలా మందికి టికెట్లు దొరికే పరిస్థితి ఉండదు. అయితే త్వరలో విశాఖ వాసుల కోసం పర్యాటక శాఖ సరికొత్త టూర్ ప్యాకేజీ అందుబాటులోకి తీసుకొస్తోంది.

రోజూ ప్రత్యేక బస్సు సర్వీసు
విశాఖ నుంచి తిరుపతికి 30 స్లీపింగ్ బెర్త్‌లతో (ఏసీ స్లీపర్) బస్సు ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటల నుంచి రోజూ ఈ సర్వీసు అందుబాటులోకి రానుంది. రోజూ అప్పుఘర్ యాత్రి నివాస్ హోటల్ (హరిత టూరిజం హోటల్) నుంచి ప్రారంభమై ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎన్ఏడీ జంక్షన్, గాజువాక, అనకాపల్లి, రాజమండ్రి, శ్రీకాళహస్తి మీదుగా తిరుపతి చేరుకుంటుంది. ఈ టూర్ ప్యాకేజీలో భాగంగా పెద్దలకు రూ.6300, పిల్లలకు రూ.6 వేలు ఛార్జ్ చేయనున్నారు. 19న తొలి సర్వీసును జిల్లా కలెక్టర్ హరేందర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఏపీటీడీసీ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి ప్రారంభించనున్నారు. టికెట్లను ఏపీటీడీసీ వెబ్‌సైట్ ద్వారా, లేదా 8897464333 (మార్కెటింగ్), సీఆర్‌వో 9848813584 నంబర్ ద్వారా ప్రయాణానికి వారం రోజులు ముందుగా బుక్ చేసుకోవాలని ఏపీటీడీసీ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌పాణి తెలిపారు.

టూర్ సాగేది ఇలా...
- మొదటి రోజు విశాఖ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ప్రయాణం.
- రెండో రోజు శ్రీకాళహస్తి హరిత హోటల్‌లో ఫ్రెషప్, అల్పాహారం.
- అనంతరం అదే రోజు తిరుపతి దర్శనం, ఏపీటీడీసీ శ్రీనివాసం హోటల్‌లో మధ్యాహ్నం భోజనం.
- అదే రోజు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ దర్శనం, అనంతరం శ్రీకాళహస్తిలో హరిత హోటల్‌లో రాత్రి భోజనం.
- భోజనం అనంతరం విశాఖకు తిరుగు ప్రయాణం.
- మూడో రోజు ఉదయం 9 గంటలకు విశాఖ చేరుకోవడంతో టూర్ ముగుస్తుంది.

కల్లం పాకల వద్ద తగాదా వల్లే హత్య

- వృద్ధుడి హత్య కేసులో నిందితుడు అరెస్టు

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం తాచేరు నది సమీపంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో సూరిశెట్టి సూర్యనారాయణ (68)ను అదే గ్రామానికి చెందిన సూరిశెట్టి నర్సింహమూర్తి(నర్సింగరావు) కత్తితో నరికి విచక్షణ రహితంగా హత్య చేశారని కె.కోటపాడు సీఐ బి.సి హెచ్. స్వామినాయుడు సోమవారం రాత్రి మాడుగుల పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. వివరాలిలా వున్నాయి. స్థానిక తాచేరు నది సమీపంలో సూర్యనారాయణ, నర్సింగరావు కల్లాలు పక్క పక్కనే ఉన్నాయి. రెండు పశువుల పాకలకు మధ్య నీరు పోయే కాలువ ఉంది. కాలువ వెడల్పు చేసే క్రమంలో నర్సింగరావు సూర్యనారాయణ పాక వైపు వున్న మట్టిని తొలగించారు. దీంతో ఇద్దరి మధ్య తగాదా చోటు చేసుకుంది. ఈ సమస్య గురించి గ్రామ పెద్దల సమక్షంలో తేల్చుకుందామని సూర్యనారాయణ చెప్పినా నర్సింగరావు వినలేదు. ఈ నేపథ్యంలో సూర్యనారాయణ ఆదివారం తన పశువులను మేతకు తోలుకెళ్లి సాయంత్రం తిరిగి పాక వద్దకు వచ్చారు. ఆ సమయంలో ఇద్దరి నడుమ మళ్లీ గొడవ జరిగింది. దీంతో నర్సింగరావు సూర్యనారాయణను కిందికి తోసివేసి కత్తితో విచక్షణరహితంగా మెడ మీద నరికి వేశాడు. సూర్యనారాయణ కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు పరిగెత్తుకు రాగా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అప్పటికే తీవ్ర గాయాలపాలైన సూర్యనారాయణ మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు సూరిశెట్టి వెంకట అప్పారావు ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి మృతదేహానికి సోమవారం పంచనామా అనంతరం అనకాపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. నిందితుడు నర్సింగరావును అరెస్టు చేసి కోర్టుకు రిమాండుకు తరలించినట్టు సీఐ స్వామినాయుడు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు. అంతకుముందు హత్య జరిగిన కల్లం పాకలను సీఐ, ఎస్ఐ క్లూస్‌టీంతో పాటు సందర్శించి, వివరాలు సేకరించారు.


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న కె.కోటపాడు సీఐ స్వామినాయుడు, ఎస్ఐ దామోదర్‌నాయుడు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి-బయ్యవరం రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు నుంచి సోమవారం ప్రమాదవశాత్తూ జారి పడి ప్రయాణికుడు మృతి చెందాడు. తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ అందించిన వివరాలివి. విజయవాడ నుంచి విశాఖ వైపు వస్తున్న గుర్తు తెలియని రైలు నరసింగబిల్లి-బయ్యవరం రైల్వే స్టేషన్ల మధ్యకు చేరే సరికి రైలులో ప్రయాణిస్తున్న బుచ్చియ్యపేట మండలం గున్నెంపూడికి చెందిన ఆరేపు సోమేశ్వరరావు(25) ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి కింద పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రాజమండ్రి నుంచి అనకాపల్లికి వస్తుండగా దుర్ఘటనకు గురయ్యాడు. మృతుని పూర్తి వివరాలు తెలియరాలేదు. మృత దేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బంధువుల కోసం భద్రపరిచారు. కేసు నమోదు చేసి సంఘటన గురించి మృతుని బంధువులకు సమాచారం అందజేసినట్టు ఎస్ఐ మారూఫ్ తెలిపారు.

గున్నెంపూడిలో విషాదఛాయలు
బుచ్చెయ్యపేట : రాజమండ్రి నుంచి అనకాపల్లి వస్తూ రైలు నుండి జారి పడిన ఆరేపు సోమేష్ వివరాలు తెలిశాయి. బుచ్చెయ్యపేట మండలం గున్నెంపూడికి చెందిన సోమేష్ రెండు రోజుల క్రితం రాజమండ్రిలో ఉన్న తన అక్కాబావల వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆదివారం సాయంత్రం తాను ప్రయాణిస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారి పడిపోయాడు. రాజమండ్రి వెళ్లిన కుమారుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి శ్రీను సోమేష్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఆందోళన చెందారు. గున్నెంపూడికి చెందిన వ్యక్తి గాజువాక క్రైం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించడంతో ఆయనకు సమాచారం అందించారు. ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు బయ్యవరం సిమ్మెంట్ ఫ్యాక్టరీ దగ్గరలో సోమేష్ మృతదేహం రైలు పట్టాలు పక్కన పడి ఉండడాన్ని గుర్తించారు. సంఘటన జరిగిన స్థలం తుని ఏరియాకు రావడంతో రైల్వే పోలీసులు తుని ఏరియా ఆస్పత్రికి సోమేష్ మృత దేహాన్ని తరలించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు సోమేష్ భౌతికకాయాన్ని అందజేశారు. పెద్ద కుమారుడు వెంకటేష్ రైల్వేలో ఉద్యోగం చేయగా చిన్న కుమారుడు సోమేష్ డిగ్రీ చేస్తూ వ్యవసాయంలో తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. ఎదిగొచ్చిన కుమారుడు సోమేష్ మృతితో తల్లిదండ్రులు శ్రీను, లక్ష్మిలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


సోమేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు (ఇన్‌సెట్) ఆరేపు సోమేశ్వరరావు (ఫైల్)

కడుపునొప్పి తాళలేక గొంతు కోసుకున్నాడు...

అనకాపల్లి : స్థానిక కోట్నివీధికి చెందిన కె. శ్రీధర్ కడుపునొప్పితో కొంతకాలంగా బాధపడుతూ సోమవారం ఆత్మహత్యకు పాల్పడి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. శ్రీధర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చాకుతో గొంతుకుని బయటకు రావడంతో స్థానికులు గమనించి అతనిని వెంటనే ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. సంఘటన స్థలానికి పట్టణ సీఐ శంకరారవు చేరుకుని వివరాలను సేకరిస్తున్నారు.


చికిత్స పొందుతున్న కె.శ్రీధర్

కేజీహెచ్‌లో సమూల మార్పులు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యప్రసాద్


మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య ప్రసాద్, చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

మహారాణిపేట: సమాజంలో అన్ని వృత్తుల కంటే వైద్య వృత్తి చాలా గొప్పదని, అటువంటి వృత్తిని సేవా దృక్పథంతో చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్య ప్రసాద్ వైద్యులకు పిలుపునిచ్చారు. సోమవారం కేజీహెచ్ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రైవేటు ఆస్పత్రుల వైపు రోగులు మొగ్గు చూపకుండా ఉండాలంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. 68 లక్షల మందికి ఆరోగ్య శ్రీ ద్వారా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే రాష్ట్రంలో కొత్తగా 12 వైద్య కళాశాలలు నిర్మించనున్నామని, ఇందుకు అవసరమైన మ్యాచింగ్ గ్రాంట్ నిధులు సమీకరణ కోసం ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. అందరి సహకారంతో కేజీహెచ్ సమూల మార్పునకు శ్రీకారం చూడదామన్నారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ ఇకపై కేజీహెచ్ ఏ నిర్మాణం చేపట్టినా 50 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని నిర్మించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుంచే కాకుండా ఒడిశా నుంచి వచ్చే రోగులకు కూడా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఉత్తర శాసనసభ్యులు పి. విష్ణుకుమార్ రాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు , ఎస్. కోట ఎమ్మెల్యే కె.లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భారీ వర్షం.. రైతుల హర్షం



కశింకోట పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

కశింకోట: మండలంలో సోమవారం భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. కొద్ది రోజులుగా ఇక్కడ సరైన వర్షం లేదు. దీంతో ఎక్కువ మంది రైతులు వరి నారుమళ్లు వేయడానికి, వరి నారు తడ పడానికి నీరు లేక ఇబ్బంది పడుతున్న నేప థ్యంలో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దాదాపు గంటన్నర పాటు వర్షం పడింది. కశింకోటలోని రోడ్లపై ఏరులా నీరు ప్రవహిం చింది. మడుల్లో నీరు చేరింది. లోతట్టున ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోడ్డు, మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నీరు చేరింది. రాకపోకలకు ప్రజలు ఇబ్బంది చెందారు.

రైతు సేవా కేంద్రం సందర్శన



ఖరీఫ్ వరి నారుమళ్లను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి స్వప్న

కశింకోట: మండలంలోని నూతలగుంటపా లెంలో రైతు సేవా కేంద్రాన్ని సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.స్వప్న సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వ్యవసాయ యాంత్రీకరణ కేంద్రంలోని వ్యవసాయ పని ముట్లను పరిశీలించారు. అనంతరం నూతల గుంటపాలెంలో రైతులు నాటిన ఖరీఫ్ వరి నారుమళ్లను ఆమె పరిశీలించి, వాటి సస్య రక్షణ మెళకువలను రైతులకు వివరించారు. వ్యవసాయ సహాయకుడు మధు, తదితరులు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. బంగాళాదుంప, బెండకాయ, వంకాయ, దొండకాయ కిలో రూ.40, టమాటా, ఉల్లిపాయ రూ.50, బీట్రూట్, క్యారెట్ రూ.60, క్యాప్సికం రూ.100 చొప్పున విక్రయాలు సాగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 78 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,580	4,580
రెండో రకం	--	--
మూడోరకం	3,200	3,600

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి 2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి 2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
భారతీయుడు 2	:షిర్డిసాయి
భారతీయుడు 2	:పర్తిసాయి
మనమే	:వెంకటేశ్వర
14	:శ్రీసత్య
సారంగదరియా	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-18 యూనిట్లు, ఓ పాజిటివ్-21 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 386 మంది గ్యాస్ బుక్ చేసుకు న్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 345 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరా లకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

బాబూ.. హామీ నెరవేర్చుకో

ఇస్తారో.. ఇవ్వరో తెలియటంలేదు..



నా పేరు పసుపులేటి భాస్కర్. నేను డిగ్రీ పూర్తి చేశాను. మండలంలోని శంకరం గ్రామంలో నివసిస్తున్నాను. నాతో పాటు నా సోదరుడు శేఖర్ కూడా నిరుద్యోగే. నాకు చదువుకు తగ్గ ఉద్యోగం దొరక్క మా బంధువులకు సంబంధించిన వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాను. చంద్రబాబు ఇచ్చిన హామీతో జాబ్ వస్తుందని సంతోషం కలిగింది. అయితే షరతులు వర్తిస్తాయనే చిన్న మాటతో హామీలు అమలు చేయకుండా తప్పించుకుంటా రేమో అనిపిస్తుంది. ఇన్ని రోజులైనా ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి ఊసే లేదు.

ఆశగా ఎదురు చూస్తున్నాం..



నా పేరు ఉరిగిటి నాగ శ్రీను. కశింకోటలో నివసిస్తున్నాం. డిగ్రీ చదివి ఖాళీగా ఉన్నాను. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాను. నిరుద్యోగులకు భృతి ఇవ్వనున్నట్లు రాష్ట్రంలో అధికార కూటమి ఎన్నికల ముందు ప్రకటించింది. ఈ మేరకు నిరుద్యోగ భృ తి కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం. నిరుద్యోగ భృతి అందివ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



- నిరుద్యోగ భృతి కోసం యువత నిరీక్షణ
- తమ ఆశ నెరవేర్చాలని డిమాండ్

అనకాపల్లి/తుమ్మపాల/కశింకోట : అనకాపల్లిలో సుమారు 31 వేల కుటుంబాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల ముందు నిరుద్యోగు లకు ఉద్యోగాలు వచ్చే వరకూ నిరుద్యోగ భృతి అంది స్తామని సూపర్ సిక్స్ పేరిట ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పింది. అయితే ప్రభుత్వం అధికారం చేపట్టి నెల రోజులు పూర్తవుతున్నప్పటికీ నిరుద్యోగులకు ఎటువం టి భృతి ఇవ్వకుండా.. దానికి సంబంధించి ఎలాంటి విధి విధానాలు ప్రకటించకుండా సుమారు 45 వేల మంది నిరుద్యోగులను నిరీక్షణకు గురి చేస్తోంది.

నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నా..



నేను రెండు సంవత్సరాల క్రితం బీకాం పూర్తి చేసాను. అప్పటి నుంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యో గులకు నెలకు రూ. 3 వేలు అందిస్తామని చెప్పింది. అయితే అందుకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎవరిని కలవాలనే విషయాలేవీ తెలియటంలేదు. దీనిపై వెంటనే వివరాలు ప్రక టించాలి.

– పి.మణికుమారి, విజయరామరాజుపేట, అనకాపల్లి


వాగ్దానం అమలు చేయాలి..



నేను ఏడాది క్రితం పీజీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధిం చాను. కూటమి ప్రభుత్వం నిరు ద్యోగ భృతి అందజే స్తామని చెప్పడం ఎంతో ఆనందం కలిగించింది. నిరుద్యోగ భృ తి ఇచ్చినట్లయితే వివిధ ప్రభుత్వ శాఖల్లో నిర్వహించే కాంపిటీటివ్ పరీక్షలకు శిక్షణ పొం దేందుకు ఉపయోగపడుతుంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఈ ఏడాది ఆగస్టు నుంచి నిరుద్యోగ భృతి ఇస్తుందని ఆశిస్తున్నాను.

– జి. గీతాకృష్ణ, అనకాపల్లి

బుద్ధావతారంలో జగన్నాథుడు



అనకాపల్లి: జగన్నాథ నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా ఎనిమిదో రోజు సోమవారం బుద్ధావతారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చాడు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గూడ్స్ రోడ్డులోని ఇంద్రద్యు మ్నహాల్లో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకుడు బంకుపల్లి సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో రాజసులోచన, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, డైరెక్టర్లు బొండా రాజేష్, మోహన్‌రావు, వెంకట చలపతిరావు, వెంకటవీర అప్పారావు, కోటేశ్వర రావు, ధనలక్ష్మి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడిగా దర్శనం

కశింకోట: కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో జగన్నాథ స్వామిని శ్రీకృష్ణుడిగా అలం కరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచా ర్యులు ఆధ్వర్యంలో అర్చకులు రేజేటి సీతారామా చార్యులు, శ్రీరామచరణాచార్యులు పూజా కార్యక్ర మాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతోనే ఉన్నత శిఖరాలు



వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేసిన యువతి సత్కరిస్తున్న సమంత్‌కుమార్‌రెడ్డి

అనకాపల్లి : నిరుద్యోగ యువత సమయాన్ని వృథా చేసుకోకుండా వృత్తిలో నైపుణ్యం సాధించాలని నాబార్డ్ డీడీఎం సమంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సమా వేశం నిర్వహించారు. వరల్డ్ యూత్ స్కిల్ డేను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందన్నారు. దాన్ని వెలికి తీసి నప్పుడు మనిషి ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు స్వయం ఉపాధితో అభివృ ద్ధి సాధించాలన్నారు. అనంతరం గతంలో సంస్థలో శిక్షణ పొంది స్థిరపడిన యువతను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎస్‌బీఐ ఎల్‌డీఎం శ్రీనివాసరావు, సంస్థ డైరెక్టర్ బి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి

అనకాపల్లి: రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించి, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవ స్థాపకుడు బల్లా నాగభూషణం కోరారు. స్థానిక జోనల్ కార్యాలయం వద్ద సోమవారం ట్రాఫిక్ సమస్యలపై ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి కేంద్రంగా నాలుగేళ్ల కిందట జిల్లాగా ఏర్పడిందని, పట్టణ జనాభా రోజురోజుకూ పెరుగుతోంద న్నారు. రహదారులు, ఫుట్‌పాత్‌లను చిరువ్యాపా రులు ఆక్రమించి వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రధాన జంక్షన్ల వద్ద కొత్తగా ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేశ్ గుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు బొడ్డు సోమ రాజు, కాపారపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో కంటి సమస్యలు దూరం



కంటి ఆస్పత్రి సిబ్బందితో విద్యార్థులు

అనకాపల్లి : నిత్యం ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం వల్ల కంటి సమస్యలు లేకుండా జీవిం చవచ్చని మామిడిపాలెం హైస్కూల్ హెచ్ఎం హెచ్‌బీ శ్రీధర్ అన్నారు. స్థానిక హైస్కూల్ ఆవర ణలో మొహిసిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్, విశాఖ ఐ ఆస్పత్రి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీ క్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యతో ఇబ్బంది పడు తున్న విద్యార్థులు సకాలంలో వైద్యుని సలహా తీసు కోవాలన్నారు.

ఈ సందర్భంగా 9 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరం అవసరం అవుతాయని, మరో నలుగురు విద్యార్థులను విశాఖ ఐ ఆస్పత్రికి తర లించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వి. వరప్రసాద్, బి.వి.ఎస్. బాబు, జి.చిన్నబ్బాయి, గ్రామ సర్పంచ్ పూడి పరదేశి నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి : పట్టణ పరిధిలో విద్యుత్ శాఖ డీ-1 సెక్షన్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతు పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి 12 గం టల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏడీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనగర్‌నగర్ ఫీడర్ పరిధిలో కోట్ని వీధి, గాంధీబొమ్మ జంక్షన్, పెరుగుబజార్ జంక్షన్, కర్నాల వీధి, పప్పుల వీధి, గొల్లవీధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

హెల్మెట్ విధిగా ధరించండి



అవగాహన కల్పిస్తున్న యలమంచిలి బార్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ పోలీసులు

యలమంచిలి: వాహన చోదకులు హెల్మెట్‌ను విధిగా ధరించాలని యలమంచిలి ట్రాఫిక్ ఎస్‌ఐ రామకృష్ణ ప్రజలకు సూచించారు. సోమవారం పట్టణంలో యలమంచిలి పట్టణ, రూరల్ పోలీసులు, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యా ర్థులతో కలసి అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్‌ఐ మాట్లా డుతూ వచ్చే నెల నుంచి మారుతున్న చట్టాలకు అనుగుణంగా ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ చేసే వ్యక్తితోపాటు వెనుక ప్రయాణిస్తున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా అందరూ పాటించాలని ప్రమాదాల నివారణకు అరికట్టేం దుకు అందరూ కృషి చేయాలని కోరారు. హెల్మెట్ ధరించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో యలమంచిలి బార్ అసోసియేషన్ సభ్యులు, యలమంచిలి పట్టణ ఎస్‌ఐ పాపినా యుడు, ట్రాఫిక్ పోలీసులు, పట్టణ పోలీసులు, ఆటోడ్రైవర్లు, ప్రభుత్వ వివిధ కళాశాలల విద్యా ర్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి వినతి



స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వినతిపత్రం అందిస్తున్న గ్రంథాలయ సమితి ప్రతినిధులు

నర్సీపట్నం: ఉమ్మడి జిల్లా కేంద్రమైన విశాఖలో జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాల నిర్మాణం చేప ట్టాలని కోరుతూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపా త్రుడికి పౌరగ్రంథాలయ సేవా సమితి ప్రతిని ధులు, విశ్రాంత ఉద్యోగులు సోమవారం వినతి పత్రం అందించారు. ఆర్థిక రాజధాని విశాఖలో కేం ద్ర గ్రంథాలయ భవనాలను త్వరితగతిన నిర్మించా ల్సిన అవసరం ఉందన్నారు. మహారాణిపేటలోని రూ.100 కోట్ల విలువైన గ్రంథాలయానికి సంబం ధించిన ఎకరా స్థలాన్ని బడా రాజకీయ నేతలు కబ్జా చేయాలని చూశారని, దానిపై పౌర గ్రంథాలయ సేవా సమితి అడ్డుకోవటంతో ఆగిందన్నారు. స్థలాన్ని కాపాడి, గ్రంథాలయ భవనాల నిర్మాణా నికి చర్యలు తీసుకోవాలని అయ్యన్నపాత్రుడిని కోరారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృ ష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని స్పీకర్ హామీ ఇచ్చి నట్లు వారు తెలిపారు.

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించా లని ఆర్డీవో హెచ్.వి.జయరాం మండలస్థాయి అధికారు లను ఆదేశించారు. సోమవారం ప్రజలు అందిం చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. భూసమ స్యలు, రేషన్‌కార్డులు, పింఛ న్లు, సదరం సర్టిఫికెట్లు తదితర అంశాలపై 18 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్క రించేలా చర్య లు తీసుకోవాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే వచ్చే పరిణామాలకు సంబంధిత అధికారులదే బాధ్యతని హెచ్చరిం చారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం రేపు

అనకాపల్లి : జోన్ పరిధిలో అమృత్ 2.0లో భాగం గా తాగు నీటి సరఫరా మెరుగుపరిచే కార్యక్రమం నిర్వహిస్తున్నందున ఈనెల 17వ తేదీ బుధవారం జోన్‌లో తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్ రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఎస్‌సీ పైపులైన్ల స్థానంలో 500 ఎంఎం వ్యాసార్థం కలిగిన డీఐ పైపులైన్లు వేయనున్నట్లు పేర్కొన్నారు. మండ లంలో తుమ్మపాల హెడ్ వాటర్ వర్క్స్ నుంచి ప్రస్తుతం ఉన్న పీఎస్‌సీ పైప్‌లైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేసే అనకాపల్లి ప్రాంతం అంతా అంత రాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రత్యామ్నా యంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుం దన్నారు.

ఉత్తమ ఫలితాలు రాబట్టాలి..



కేజీబీవీలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎస్‌డీడీ రమణ

కోటవురట్ల : ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యా యులు కృషి చేయాలని సర్వశిక్షా అభియాన్ స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.డి.వి.రమణ సూచించారు. స్థానిక కేజీబీవీని జీసీడీవో పద్మావతితో కలిసి ఆయన సోమవారం తనిఖీ చేశారు. పరిసరాలు, కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల అభ్యసనా సామ ర్థ్యలను పరీక్షించారు. వివిధ పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి, ఆరంభం నుంచి పట్టు సాధించాలని విద్యార్థినులకు సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ బోధనాంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలని సూచించారు. జీసీడీవో పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బాలికలకు అన్ని అంశాలపై అవగాహన అవసరమని, చట్టాల గురిం చి చైతన్యం కలిగి ఉండాలని అన్నారు. సమస్య ఉం టే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి ధైర్యంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో సరి తాదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

నారుమడులకు ఊపిరి పోసిన వర్షం

కె.కోటపాడు: మండల గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడంతో రైతులు వర్షం పడుతుందని ఎదురుచూసినా పడలేదు. ఇప్పటికే వరి నారుమడులను సిద్ధం చేసి విత్తనాలు చల్లారు. వర్షాల్లేక పోవడంతో అందుబాటులో ఉన్న వ్యవసాయ బోర్ల నుంచి పలు గ్రామాల్లో ఆకుమడులకు నీటి తడుల్ని రైతులు అందించారు. బోర్లు అవకాశం లేని రైతులు వరుణుడిపై భారం వేసి ఆశగా ఎదురు చూశారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఆకుమడులకు ఈ వర్షం ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు.

మాడుగుల రూరల్/బుచ్చెయ్యపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వాతావరణం చల్లబడింది. దీంతో పాటు ఎండిపోతున్న వరినారుకు ఊపిరినిచ్చింది. మాడు గుల, బుచ్చెయ్యపేట మండలాల్లో 98 శాతం మేర వరినారు వేశారు. వర్షాల్లేక ఎండిపోతున్న నారు మడులకు తాజా వర్షాలు జీవం పోశాయి. ఈ వర్షాలకు మండలంలోని తాచేరు, పెద్దేరు, ఉరకగెడ్డ జలాశయాల్లో నీరు చేరింది. వారం రోజుల పాటు అడపా దడపా వర్షాలు కురిస్తే ఖరీఫ్ వరినాట్లు ప్రారం భమవుతాయి. మండలంలో 13 వేల ఎకరాల్లో వరినాట్లు వేసేందుకు రైతులు ఇప్పటికే నారు మడుల్ని సిద్ధం చేశారు.

మీసేవ ఆపరేటర్లను ప్రోత్సహించాలి



అడ్డురోడ్డులో సమావేశమైన మీసేవా ఆపరేటర్లు

ఎస్.రాయవరం : గ్రామాల్లో మీసేవా కేంద్రాలకు పూర్వ వైభవం రానుందని గురజాడ మండల మీసేవా అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తా ఏఎన్ బాబు అన్నారు. అడ్డురోడ్డులో సోమవారం మండల మీసేవా ఆపరేటర్లు సమావేశం అయ్యారు. ఈ సంద ర్భంగా నూతన కార్యవర్గం ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 15 ఏళ్లుగా మీసేవల పై ఆధారపడి బతుకుతున్న మీసేవా ఆపరేటర్లను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిం దన్నారు. సచివాలయాలు వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ఆపరేటర్లను నియమించినప్పటికీ ప్రజలకు సాను కూలంగా సేవలు అందివ్వలేదన్నారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక మీ సేవలకు పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారని, లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టుకుని నడుపుతున్న మీ సేవా ఆపరేటర్లను ప్రభుత్వం పోత్సహించాలని సూచించారు. ఈ కార్య క్రమంలో జిల్లా కమిటీ మెంబరు కర్రి జోగారావు, గౌరవ అధ్యక్షుడు ముత్తా గోవిందరావు, ఉపాధ్య క్షుడు కర్రి భూపతి, కార్యదర్శి భీమరౌట్టి శ్రీనివాస రావు, ఆపరేటర్లు నాని, వీసం రామస్వామి, శ్రీకాకు శపు జోగుబాబు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధుల నియంత్రణ



గొండుపాలెంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది

కె.కోటపాడు: వర్షాకాలం నేపథ్యంలో దోమలు వృద్ధి చెంద కుండా ప్రజలు జాగ్ర త్తలు తీసుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డీఎస్ ఎన్ రాజు సూచించారు. గొండుపాలెం గ్రామంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా ప్రతి శుక్రవారం పాత్రల్ని ఖాళీ చేయాలన్నారు. ఫ్రైడే డ్రైడే పేరిట ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ వ్యాధుల బారినపడే అవకాశం ఉందని, ప్రజలు దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కనక వేణి, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఏఎన్ఎం కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

కశింకోట: కశింకోటలోని శివాలయంలో సోమవారం ప్రత్యేక అభిషే కాలు, పూజలు నిర్వహిం చారు. అర్చకులు వి.చిదం బరం, వి.కృష్ణ కార్యక్ర మాలు జరిపారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు.